విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 28 జనవరి 2025 8 పేజీలు

ప్రభుత్వోద్యోగులూ హెల్మెట్ ధరించాలి

- లేకుంటే సాధారణ సెలవుగా పరిగణింపు
- కలెక్టర్ కె. వెట్రిసెల్వి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు ఫిబ్రవరి 1 నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేదంటే సాధారణ సెలవుగా పరిగణించబడుతుందని కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు అనుసరించి ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లోని ద్విచక్రవాహనం కలిగిన ఉద్యోగులు హెల్మెట్ ధరించి కార్యాలయాలకు హాజరై అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. వాహన చోదకుల నిర్లక్ష్యం, ఇతర కారణంగా ప్రమాదాలతో వారి కుటుంబాలను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇప్పటికే ఈవిషయంపై అన్నిస్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు. హెల్మెట్ ధారణపై మరింత విస్తృత చర్యల్లో భాగంగా తొలిగా ప్రభుత్వ కార్యాలయాలకు వాహనాలపై వచ్చే ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రావాలన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రజలతో పాటు అధికారులు కూడా తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆయా కళాశాలల్లో నోహెల్మెట్-నోఎంట్రి విధానం అమలు అవుతున్నదీ లేనిదీ సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు.సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి,జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు,ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రజా సమస్యలు జవాబుదారీతనంతో అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి 'పిజిఆర్ఎస్ మీ కోసం'లో ప్రజల నుంచి 30 అర్జీలను జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడుతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ మండలస్థాయి అధికారులు అందరూ ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు పరిష్కారం చేయ్యాల్సి ▶మిగతా 2లో..

విద్యాసంస్థలు ఫీజుల దోపిడి

వామపక్ష, విద్యార్థి సంఘాల నిరసన

విశాలాంధ్ర-ఏలూరు: కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల ఫీజులు దోపిడీ ఆపాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ అడ్డం పెట్టుకొని విద్యార్థులను ▶మిగతా 2లో..

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం: పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ తక్షణమే అమలు జరిపి పేదల సొంత ఇంటికల నెరవేర్చాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య తాడేపల్లిగూడెం పట్టణ శాఖల ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణ 31 వ వార్డులో ఇళ్ళస్థలాలు అర్జీలు పూరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పేదలు సొంత గృహాలు లేక అద్దె ఇళ్ళకు నెలకు ఐదు, ఆరు వేల రూపాయలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామన్న అన్ని సంక్షేమ పథకాలు కన్నా ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న హామీ ముఖ్యమైందన్నారు. పేదలు అద్దె ఇళ్ళల్లో కాకుండా సొంత ఇళ్ళలో వుండే పరిస్థితి కల్పిస్తే ప్రతీ పేద కుటుంబానికి నెలకు ఐదు నుంచి ఆరు వేల రూపాయలు వరకు ఆర్థిక భారం తగ్గుతుంద న్నారు. తక్షణమే పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని భీమారావు కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్డాది మేరీ, ప్రధాన కార్యదర్శి ఎన్. నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జనన సర్టిఫికెట్‌కు రూ.ఐదువేలు చెల్లించాల్సిందే

- సూరంపాలెం విఆర్ఓ హుకుం
- ప్రతి సర్టిఫికెట్‌కు ఒక్కో రేటు
- ఎంపీ తంగెళ్ల సహకారంతో కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

విశాలాంధ్ర - గండేపల్లి : దేవుడు వరమిచ్చిన పూజారి వరమివ్వడు..అన్న చందంగా గండేపల్లి మండలం సూరంపాలెం విఆర్ఓ తీరు ఉంది. ఆయన ప్రతీ సర్టిఫికెట్‌కు ఒక రేటు నిర్ణయించి కాసులు కురిపించందే పనిచేయడం లేదని.. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం ఆ ఉద్యోగికి వత్తాసు పలుకుతున్నారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూరంపాలెంకు చెందిన అడ్డాల అనంతలక్ష్మికి ఐదుగురు సంతానం కాగా వీరిలో ముగ్గురికి జనన నమోదు సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుని గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా, పట్టించుకోకపోవడంతో ఆమె కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ శ్రీనివాసరావును ఆశ్రయించారు. ఆయన సహకారంతో కలెక్టర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన కలెక్టర్ పెద్దాపురం ఆర్డీవో, గండేపల్లి తహసిల్దార్‌కు ఆదేశాలు జారీ చేయడంతో అసలు విషయం ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అడ్డాల అనంతలక్ష్మి గత రెండు నెలల క్రితం తన పిల్లలు ముగ్గురికి జనన ధృవీకరణ పత్రాల కోసం నమోదు చేసుకుని విఆర్ఓను ఆశ్రయించగా ▶మిగతా 2లో..

జిల్లా అభివృద్ధిలో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: జిల్లా అభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు సి ఎస్ ఆర్ ఫండ్స్ అందజేయడం ద్వారా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.

సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఉండి మండలం వాండ్రం గ్రామం వెల్కమ్ ఫిషరీస్ లిమిటెడ్ అధినేత కె.సౌదాలతీఫా కలిసి సిఎస్ఆర్ ఫండ్స్ క్రింద రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి అంతా ప్రభుత్వ వ్యయంతోనే చేపట్టాలంటే సాధ్యం కాదని, వివిధ వర్గాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ ▶మిగతా 2లో..

జిల్లా ఉత్తమ వ్యవసాయశాఖ అధికారిగా మురళీకృష్ణ

విశాలాంధ్ర-లింగపాలెం: జిల్లా ఉత్తమ వ్యవసాయ శాఖ అధికారిగా లింగపాలెం మండలంలో ఐదేళ్ల నుంచి పనిచేస్తున్న కోటగిరి మురళీకృష్ణను ఎంపిక చేసి కలెక్టర్ వెట్రి సెల్వి ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈయన సేవలకు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించడంతో మండలంలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతన్నలకు వెన్నుదన్నుగా ఉంటూ వ్యవసాయ విధానంలో మెట్ట ప్రాంతమైన లింగపాలెం మండలంలో అనేక మార్పులు తీసుకువచ్చారు. వ్యవసాయానికి సంబంధించిన ప్రతి అంశంలోనూ ఈయన సేవలు ఆదర్శనీయం, అభినందనీయమని రైతులు అభినందిస్తున్నారు. ఈయనకు జిల్లా ఉత్తమ వ్యవసాయ శాఖ అధికారిక గుర్తింపు రావడాన్ని మండలంలోని వివిధ శాఖల అధికారులు అంతా అభినందించారు.

ఈవోపీఆర్డి సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో మండల పంచాయతీ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న జే.ఎం. రత్నకుమార్ సేవలు అభినందనీయమని మండలంలోని వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు కొనియాడారు. జిల్లాలో ఉత్తమ పంచాయతీ విస్తరణ అధికారిగా కలెక్టర్‌తో ప్రశంసా పత్రాన్ని అందుకున్న ఈయనకు లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాణి, తహసిల్దార్ నజీమ్, మండల విద్యాశాఖ అధికారి రామారావు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జగన్నాధరావు, ఏపీవో వరలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కుమారి, మాజీ ఎంపీపీ, తెలుగుదేశం నాయకులు మొరపూడి. మల్లికార్జునరావు, వైసీపీ నాయకులు ముసునూరు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారికి గర్వకారణం

విశాలాంధ్ర -ఏలూరు: నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ ఇవ్వడం తెలుగుజాతికి గర్వకారణం అని తేదేపా ఎన్.సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారతీయ కళా ప్రపంచంలో తెలుగు ప్రజల ప్రతిభకు మరోసారి గుర్తింపుగా ఈ పురస్కారం నిలుస్తుందన్నారు. తెలుగు సినీ రంగంలో బాలకృష్ణ కృషి అపారమైనదని, వైద్య సంరక్షణ రంగాలలో విశేషకృషి చేశారని తెలిపారు.గత ఐదు దశాబ్దాలుగా తన అభినయంతో ప్రేక్షకుల మెప్పు పొందిన బాలకృష్ణ, రాజకీయాలతో పాటుగా, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్ గా ఉత్తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు.

ప్రతీ ఒక్కరు మేధావే

స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి వెల్లడి

విశాలాంధ్ర - ఉండి : ప్రతీ విద్యార్థి మేధావి అని మోటివేటర్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. వి. సుబ్బరాజు అన్నారు. సోమవారం ఉండి మండలం చెరుకువాడ, ఉండి జెడ్పి హైస్కూల్‌లో ఉండి మానవత శాఖ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బరాజు, కలిగొట్ల గోపాల శర్మ మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు ఇక్కడే పునాది వేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉండి శాఖ కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు కో చైర్మెన్ దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా సభ్యులు వెంకటపతిరాజు, కాలేజ్ రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ కె వి ఎన్ రాజు, మండల చైర్మెన్ రుద్రరాజు యువరాజు, కె. నాగబాబు,హెచ్ ఎం. రామలక్ష్మి,మంతెన పార్వతి దేవి,మూర్తి, ముదిరాజ్,సుకుమార్,ప్రకాష్, శ్రీనివాస్, సూర్య కుమారి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు. టెన్త్ క్లాస్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రం, మోమెంటో, బుక్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెల్లించాల్సిందే (1వ పేజీ తరువాయి)

ఆ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఒక్కొక్క పత్రానికి ఐదు వేల రూపాయల చొప్పున 15 వేలు డిమాండ్ చేసారు. తాను అంత ఇవ్వలేనని ఎనిమిది వేలు ఇస్తాను అని చెప్పినా వినకపోవడంతో ముందుగా 11 వేలు ఇస్తానని పండుగ అనంతరం మిగిలిన నాలుగు వేలు ఇస్తానని ప్రాధేయపడ్డానని అనంతలక్ష్మి ఆవేదనతో తెలిపింది. అప్పటికి వినకపోవడంతో ఎంపి ఉదయ శ్రీనివాసరావును ఆశ్రయించగా ఆయన సహకారంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపింది. వెంటనే తహశీల్దార్ ఇంటికి వచ్చి జనన సర్టిఫికేట్లు అందజేశారని అనంతలక్ష్మి తెలిపింది. విఆర్ఓ పై ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటూ ఆ కుటుంబం పై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సైతం ఒత్తిడి చేస్తున్నారని ఆమె ఆవేదనతో తెలిపింది. గ్రామంలో సుమారు 40 నుండి 50 మంది విద్యార్థులు జనన సర్టిఫికేట్లు కోసం పంచాయతీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని వెంటనే జిల్లా అధికారులు స్పందించి విచారణ జరిపి బాధ్యులు పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై విఆర్ఓ మాట్లాడుతూ వారిని లంచం అడగలేదని, సర్టిఫికెట్ విచారణ చేసేందుకు ఆలస్యం అవ్వడంతో వారు కంప్లైంట్ ఇచ్చారని అన్నారు. తహశీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా డబ్బులు డిమాండ్ చేసినట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఉన్నతాధికారుల ఆదేశాలతో వారికి సర్టిఫికెట్లు అందించడం జరిగిందని తెలిపారు.

ఫీజుల దోపిడి (1వ పేజీ తరువాయి)

వేధింపులకు గురిచేసి, ఆత్మహత్యలకు కారకులైన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతి ఉన్న చోట ల్యాబ్ ఎక్విప్మెంట్స్ ఉండాలని, ల్యాబ్స్ లేని కళాశాలలో అనుమతిని రద్దు చెయ్యాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ , జిల్లా కోశాధికారి ఎం. క్రాంతి కుమార్, ఎస్ఎఫ్ఐ, పట్టణ కార్యదర్శి బి.మనోజ్, నాయకులు యస్.వంశి, సాయి, భాను,ప్రసాద్, చరితేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కరించాలి (1వ పేజీ తరువాయి)

ఉందన్నారు. అర్జీల పరిష్కార ప్రక్రియ పెండింగ్ లేకుండా అధికారులు చూడాలని స్పష్టం చేశారు. ప్రతి సమస్యకు నాణ్యతతో కూడిన విధంగా అర్జీదారులు సంతృప్తే ధ్యేయంగా పరిష్కరిస్తూ పీజీఆర్ఎస్ నిర్వహణ తీరు పట్ల ప్రజలకు నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్దిష్ట గడువు లోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని తెలిపారు.

దేవరపల్లి మండలం అచ్చయ్యపాలెం గ్రామానికి చెందిన నీరుకొండ నాగదేవి, వ్యవసాయం చేసుకోవడానికి నీటి సదుపాయం కావాలని అర్జీ సమర్పించుకున్నారు.

తాళ్లపూడి మండలం బయ్యవరం గ్రామానికి చెందిన ఉండవల్లి వెంకటలక్ష్మి తన పేరు మీద ఉన్న భూమి ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైందని, సరి చేయించాలని అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, బి. లక్ష్మీనారాయణ కొవ్వూరు ఆర్డీవో, రాణి సుస్మిత, డిఎల్‌డివో, స్లీవారెడ్డి, కొవ్వూరు డీఎస్పీ జి. దేవకుమార్, కొవ్వూరు మండల ఎమ్మార్వో దుర్గాప్రసాద్, డివిజన్ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముందుకు రావాలి

(1వ పేజీ తరువాయి)

నిబంధనల మేరకు సి ఎస్ ఆర్ ఫండ్స్ రెండు శాతం నిధులను జిల్లా యంత్రాంగానికి అందజేయాలన్నారు. ప్రభుత్వం, ప్రజలు భాగస్వామ్యంతో జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సి ఎస్ ఆర్ నిధులను ఇప్పటికే జిల్లాలోని వివిధ అత్యవసర పనులకు వినియోగిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు చెక్కును అందజేసిన సందర్భంలో వెల్కమ్ ఫిషరీస్ లిమిటెడ్ అధినేత కె.సౌదాలతీఫా, ఆమె తండ్రి కె.ఆనంద్ వున్నారు.

యువగళంకు రెండేళ్లు : బడేటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : నాటి వైసిపి అరాచక పాలనపై సమరశంఖం పూరించి యువగళం పేరుతో మొక్కవోని దీక్షతో రాష్ట్ర ఐటి శాఖామంత్రి నారా లోకేష్ చేసిన పాదయాత్ర పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాష్ట్ర ప్రజల్లో భవిష్యత్తుపై పూర్తి భరోసా నింపిందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. యువగళం పాదయాత్ర రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ యువగళం పాదయాత్ర ప్రారంభం నుంచి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యేంత వరకూ జరిగిన పరిణామాలను వివరించారు. నాటి సైకో పాలకులు పాదయాత్రను ఆపేందుకు చేసిన ప్రతి ప్రయత్నానికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎంతో ధైర్యంతో ఎదురొడ్డి పోరాడారని గుర్తుచేశారు. అధికారం చేపట్టిన అనంతరం తనదైనశైలిలో ముందుకెళ్తోన్న ఆయన తన తండ్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో కలిసి రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా దావోస్ పర్యటనను విజయవంతంగా కొనసాగించారని ఎమ్మెల్యే చంటి ప్రశంసించారు. ఈ సమావేశంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, టిడిపి నగరాధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి నాయకులు వందనాల శ్రీనివాస్, మారం అను, బొరోతు బాలాజీ, తవ్వా అరుణ కుమారి, కడియాల విజయలక్ష్మి, బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు, లోకేష్ దావోస్ పర్యటన విజయవంతం

విశాలాంధ్ర-చింతలపూడి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీశాఖ మంత్రి లోకేష్ దావోస్ పర్యటన విజయవంతం కావడమే కాకుండా వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. యువగళం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో రోషన్ కుమార్ మాట్లాడుతూ నాడు ప్రజలకు మొదటిసారి ఐటీని పరిచయం చేసి తెలుగువాడి కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం.. దావోస్ నడివీధుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఐటీ శాఖ మంత్రి లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలు నిస్తున్నా యన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించి నేటికీ 2 సంవత్సరాలు చేసుకుందని లోకేష్ ఎన్నో ఒడి దుడుకులను తట్టుకొని రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు.

జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో మహేశ్వరికి ప్రథమ స్థానం

విశాలాంధ్ర-టి నరసాపురం: జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.మహేశ్వరి ప్రథమ స్థానం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎల్. వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24,25 తేదీల్లో ఏలూరులోని సిద్ధార్థ స్కూల్‌లో నిర్వహించిన బాలోత్సవం (పిల్లల సంబరాలు) కార్యక్రమంలో జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో సుమారు 10వేల మంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో నియోజకవర్గం రోడ్లు అనే అంశంపై మహేశ్వరి ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శరత్, మధు బాబు, విజేకర్, ప్రభాకర్, రాములు, వాసు,శ్రీనివాస్, సుమతీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ పై అవగాహన

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక సెయింట్ థెరీసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిర్వహించిన కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ ప్రోగ్రాంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటర్మీడియట్లో మంచిర్యాంకును, ఫలితాలను సాధించిన తర్వాత ఆత్మస్థైర్యంతో కెరీర్‌ను ఎంచుకునే అవకాశం లభిస్తుంది అన్నారు. ఎటువంటి నేపథ్యం లేకపోయినా స్వయంగా విద్యార్థులు పాఠాలను వింటూ పోటీ పరీక్షలకు తయారు కావచ్చని అన్నారు. జువాలజీ అధ్యాపకులు డాక్టర్ మాధవీరాణి బైపిసి విద్యార్థులకు ఉన్నత విద్యా రంగంలో అవకాశాలను గురించి చర్చించారు. మేనేజ్మెంట్ అధ్యాపకులు హెప్సిబా సీఈసీ, ఎం ఇ సి విద్యార్థులకు చార్టెడ్ అకౌంటెన్సీ రంగంలో గల విద్య ఉద్యోగ అవకాశాల గురించి చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ పి విద్యార్థినులకు నూతన విద్యా విధానం గురించి వివరించారు. అధ్యాపకురాలు డాక్టర్ మేజర్ పీఎం సెలిన్ రోజ్ , క్రీడలు మరియు ఆటల ద్వారా విద్యార్థులకు విద్యా రంగంలో లభించే ఉన్నత అవకాశాలను గురించి చర్చించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జ్యోతిర్మయి విద్యార్థినుల కళాశాల గురించి పరిచయం చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ సిస్టర్ మెర్సీ ఆధ్వర్యంలో జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్ ఇందిర, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రమ నిర్వహించారు.

అగ్ని ప్రమాద బాధిత విద్యార్థికి ఎస్టీయూ సహాయం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు జిబి ఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న కుషాల్ ఈశ్వర్, భోగి రోజున అగ్ని ప్రమాదానికి గురై, భీమవరం లోని సాయి సుజిత హాస్పిటల్‌లో

చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. విద్యార్థికి జరిగిన ప్రమాదం గురించి తెలుసుకున్న యలమంచిలి ఎస్టియు శాఖ తన మానవత్వాన్ని చాటుకుంది. సోమవారం యలమంచిలి ఎస్.టి.యు మండల శాఖ అధ్యక్షులు బాలాజీ వర్మ, సుబ్బారావు. పుల్లేటికుర్తి శ్రీనివాస్ తదితరులు రూ.11 వేల రూపాయలను, బాధిత విద్యార్థికి, ఎస్టీయూ యలమంచిలి మండల శాఖ తరపున విరాళంగా.. పాలకొల్లు జీవి ఎస్వి ఆర్‌ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భవానీ ప్రసాద్ రాయపూడికి అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భవాని ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్.టి.యు చేస్తున్న కృషి మరువ లేదని కొనియాడారు. సామాజిక సమస్యలపై ఎస్.టి.యు నేతలు చేస్తున్న పోరాటాలు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చేగొండి సత్యనారాయణ, ఆర్.బాలాజీ వర్మ, పి.నాగరాజు, పి.శ్రీనివాస్ వి.గోపి, ఏ.దేవేంద్రుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ స్వామీజీ అరెస్ట్

విశాలాంధ్ర -నూజివీడు : త్వరలో మీ ఇంట్లో అశుభం జరుగుతుంది శాంతి పూజలు ప్రముఖ దేవాలయాలలో చేస్తాను అని గ్రామస్తులకు మాయమాటలు చెప్పి మోసం చేసి డబ్బులు తీసుకొని ఉడాయించే దొంగ స్వామీజీని అరెస్టు చేసి చాట్రాయి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి నూజివీడు డిఎస్పి

కెవిఎన్‌వి ప్రసాద్ సోమవారం నూజివీడు రూరల్ సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం పెరాయి గూడెం పంచాయతీకి చెందిన తూరపాటి బాలయ్య స్వామిజి వేషం వేసుకుని మోటార్ సైకిల్ పై ఆశ్వరావు పేట, చింతలపూడి, నూజివీడు, చాట్రాయి, సత్తుపల్లి పరిసర గ్రామాల్లో తిరుగుతూ తాను జాతకాలు చెబుతానని, ఇంటిలో అశుభం జరుగుతుంది అని శాంతి పూజలు ప్రముఖ దేవాలయాలలో చేస్తాను అని గ్రామస్తులకు మాయమాటలు చెప్పి మోసగిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ నెలలో మోటార్ సైకిల్ వేసుకుని అశ్వారావు పేట నుండి చాట్రాయి మండలంలోని అరుగొలను పేట వచ్చి గ్రామంలో ఒక దాబా ఇంటి వారి అల్లుడి ఈ మధ్యలోనే చనిపోయాడని తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి ఆ ఇంటి పెద్ద మనిషికి మీ ఇంటి వారికి చేతబడులు చేస్తున్నారు దాని వలన మీ అల్లుడు చని పోయినారు అని చెప్పి మరల మీ కుమారుడికి వాహన గండము ఉందని చెప్పి అది తొలగి పోవాలంటే విజయ వాడ కనకదుర్గ గుడిలో పూజలు చేయాలి అని వారికి మాయ మాటలు చెప్పి అతని వద్ద రూ. 61,000 తీసుకుని వారికి సంక్రాతి పండుగ అనంతరం పూజ సామాగ్రి పంపుతానని చెప్పి మోటార్ సైకిల్ వేసుకుని పారి పోయాడు. సుమారు 8 నెలల క్రితం నూజివీడు మండలం పోతు రెడ్డిపల్లి గ్రామంలోని ఒక ఇంటికి వచ్చి అతని చిన్న కొడుకు జీవితం బాగోలేదు అని, అతనికి శాంతి పూజలు సమ్మక్క-సారక్క దేవాలయాలలో చేస్తే అతనికి జీవితం బాగుంటుంది అని మాయ మాటలు చెప్పి అతని వద్ద నుండి 26,400 రూపాయలు తీసుకుని పారిపోయాడు. ఈ కేసులో ముద్దాయిని అరెస్ట్ చేయుటలో ప్రతిభ కనపరిచిన నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, చాట్రాయి ఎస్సై రామకృష్ణ, కానిస్టేబుళ్లు విజయభాస్కర్, .వెంకటేశ్వరరావు, విష్ణు కుమార్‌లను నూజివీడు డి.ఎస్.పి అభినందించారు. ప్రజలందరూ కూడా స్వామిజి వేషాలు వేసుకొని వచ్చిన వారి మాయమాటలు విని మోసపోకుండా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏదైనా అనుమానం ఉంటే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధి హామీ పథకాన్ని నగర పంచాయతీల్లో అమలు చేయాలి

విశాలాంధ్ర-చింతలపూడి: ఉపాధి హామీ పథకాన్ని నగర పంచాయతీల్లో కూడా అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చింతలపూడి పట్టణ శాఖ మహాసభ ఎస్. కె.కాలేషా అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కంచర్ల గురవయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రూరల్ ప్రాంతాలకే కాకుండా నగర పంచాయతీలో కూడా అమలు చేయాలని, నగర పంచాయతీ పరిధిలో గ్రామీణ పేదలు ఇంకా పేదలుగానే ఉన్నారని వీరికి ఉపాధి పని లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని కచ్చితంగా వీరికి ఉపాధి పని కేటాయించ చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహాసభ ముందుగా పార్టీ పతాకాన్ని ఎస్.కె.కాలేషా ఆవిష్కరించగా గత మహాసభ నుంచి ఇప్పటివరకు అమరులైన కామ్రేడ్స్‌కు రెండు నిమిషాల మౌనం పాటించారు. సీపీఐ శాఖ కార్యదర్శి గత మహాసభ నుంచి ఇప్పటివరకు చేసిన కార్యకలాపాల నివేదికను చదివి వినిపించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదిం చారు. చింతలపూడి పట్టణంలో పాత బస్టాండ్ జిబిజి రోడ్డు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో పబ్లిక్ టాయిలెట్స్ బాత్రూమ్స్ ఏర్పాటు చేయాలని,బైపాస్ రోడ్డును అభివృద్ధి చేసి పెద్ద పెద్ద వాహనాలను అటు మళ్లించి ట్రాఫిక్ నియంత్రణ చేయాలని తీర్మానం చేశారు. సెంట్రల్ లైటింగ్ వెలిగించాలని, 1996 మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని,

ఎస్.సి.స్మశానవాటికలను అభివృద్ధి చేయాలని, వార్డుల్లో డ్రైనేజీలతో కూడిన సిమెంట్ రోడ్లు వేయాలని,వంద పడకల ఆసుపత్రిని త్వరగా పూర్తిచేసి ప్రారంభిం చాలని, ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులు భర్తీ చేయాలని,నగర పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని తీర్మానించారు. అనంతరం ముగ్గురు సభ్యులతో కమిటీని ఒక ఆహ్వానితులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చింతలపూడి శాఖ కార్యదర్శిగా ఎస్ కే జానీని తిరిగి ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఎస్.కె.కాలేషా, నర్సింగ రామారావు, ఆహ్వానితులుగా తాడిగడప మాణిక్యాలరావు ఎన్నికయ్యారు. శాఖ మహాసభలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, గంధం అంజమ్మ, ఇందిరా, శ్రీరాముల రామకృష్ణ, మానేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోమలి కార్తీక్‌కు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర- ఏలూరు: వివిధ ప్రాంతాల్లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభచూపిన ఎ. కోమల్ కార్తీక్ ను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అభినందించారు. స్థానిక కలెక్టర్ గోదావరి సమావేశమందిరంలో సోమవారం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోఆయాప్రాంతాల్లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో పాల్గొని మెడల్స్ పొందిన ఎ. కోమల్ కార్తీక్ కలెక్టర్ కె. వెట్రిసెల్విని మర్యాదపూర్వ కంగా కలిశారు. హిమాచల్ ప్రదేశ్ ఈటా నగర్‌లో గత డిశంబరు 28 నుండి జనవరి 8వ తేదీవరకు జరిగిన జూనియర్ నేషనల్ ఛాంపియన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 310 కేజీల విభాగంలో సరికొత్త జాతీయ రికార్డును కార్తీక్ సాధించారు. 96 కేజీల విభాగంలో సీని యర్ నేషనల్ ఇంటర్ స్టేట్ సిల్వర్ మెడల్‌ను కూడా సాధించారు. పంజాబ్‌లో లవ్ లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీ లో జనవరి 15 నుండి 18 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ లో సిల్వర్ మెడల్ ను సాధించారు. ఖత్తర్ లో ఈనెల 19 నుండి 25 వరకు జరిగిన జూనియర్ ఏషియన్ ఛాంపియన్ షిప్ 96 కేజీల విభాగంలో కార్తీక్ పాల్గొన్నారు. అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ ఎ.శ్రీనివాసరావు కుమారుడైన ఎ. కోమల్ కార్తీక్ మరిన్ని విజయాలు సాధించాలని

జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోమల్ కార్తీక్ ను ప్రోత్సహించిన డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్ ఎం. రమేష్ బాబు, స్టేట్ కార్యదర్శి టి. దీనపబాబు, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట్రామయ్యలను కలెక్టర్ అభినందించారు.

అభివృద్ధికి దూరంలో గిరిజనం

సమస్యలపై సీపీఐ ర్యాలీ

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేత

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలో వలస గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ కుక్కునూరు మండల సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడారు. వలస గిరిజన గ్రామాల్లో నెలకొన్న

సమస్యలతో గిరిజనుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు రహదారుల సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. తాగునీటి సౌకర్యం లేక.. కలుషిత నీరు తాగి వలస గిరిజనులు రోగాల బారిన పడి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పలు ప్రాంతాలలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ లేకపోవడంతో పిల్లలకు చదువులు సాగక.. వారి భవిష్యత్తు అంధకారంలో మగ్గుతుందన్నారు. వలస గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలతో పాటు కుల ధృవీకరణ పత్రాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కుక్కునూరు ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు పడకేయడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. దుమ్ము.. ధూళితో ప్రయాణికులు,పలు గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని,రైతుల పంట పొలాలు కూడా దెబ్బతింటున్నాయని తక్షణమే అధికారులు స్పందించి సమస్యలన్నీ పరిష్కారించాలని కోరారు. అనంతరం కుక్కునూరు తహసీల్దార్ రమేష్ బాబుకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, కూరకుల బాబూరావు, జోగేశ్, సోమయ్య, సోదే రమేష్ తదిరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలి

బి.కె.ఎం.యు. ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: ఉపాధి లేక పొట్ట చేత్తో పట్టుకొని వలసలు వెళుతున్న గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు తక్షణమే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం బికెఎంయు

నాయకులు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి ఉపాధి హామీ పనులు గ్రామీణ పేదలకు కల్పించాలని విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 పని దినాలు కల్పించి రోజు కూలి రూ.700లు ఇవ్వాలని కోరారు. మెటీరియల్ కాంపోనెంట్‌ను ప్రభుత్వమే భరించి మొత్తం ఉపాధి హామీ నిధులను కూలీలకే ఖర్చు చేయాలని ఆయన కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బి కే యం యు జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాల యేసు, తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-కాళ్ల : నియోజకవర్గ అభివృద్ధిలో పార్టీలకతీతంగా అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. కాళ్ల మండలం కాళ్ళకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కాళ్ల పోలీస్ స్టేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సోమవారం రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామకృష్ణం రాజు, కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉండి నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్ల అభివృద్ధికి, మౌలిక వసతుల ఏర్పాటుకు విశేష కృషి చేస్తున్న శాసనసభ ఉప సభాపతి, ఉండి నియోజకవర్గ శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజుకు జిల్లా పోలీసు శాఖ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ ఈ నూతన భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధుల విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని అతి స్వల్ప కాలంలో భవన నిర్మాణం పూర్తి కావడానికి సహకరించిన జిల్లా కలెక్టర్ సి.నాగరాణి కి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, భీమవరం సబ్ డివిజన్ డిఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.జగదీశ్వర్‌రావు, భీమవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కాశీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం : ఎమ్మెల్యే చంటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ప్రజాశ్రేయస్సే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఉద్ఘాటించారు. ఒకపక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కా రాలకు ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గంలో నిరాటంకంగా శ్వాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వినతులు అందించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల్ని గాలి కొదిలేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్కెమ్మార్ పెదబాబు, టిడిపి నాయకులు చల్లా సత్య వరప్రసాద్, బెల్లపుకొండ కిషోర్, వందనాల శ్రీనివాస్, అమరావతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీర రాఘవరెడ్డి రైతులకు చేసిన సేవ మరువలేనిది : సంతాపసభలో వక్తలు

విశాలాంధ్ర -పెంటపాడు : రైతు ఉద్యమ నేతగా రైతు సమస్యలపై నిరంతరం కృషి చేస్తూరైతుకు నిలువెత్తు రూపమైన నల్లమిల్లి వీర రాఘవరెడ్డి మృతి వ్యవసాయ రంగానికి ,ముఖ్యంగా రైతు ఉద్యమానికి తీరని లోటు అంటూ రైతు కార్యాచరణ సమితి నాయకులు ఘన నివాళులు అర్పించారు. రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కీ.శే. నల్లమిల్లి వీర రాఘవరెడ్డి సంస్మరణ సభ సోమవారం పెంటపాడులో ఆయన స్వగృహం వద్ద జరిగింది. సంతాప సభకు ఏఎంసీ మాజీ డైరెక్టర్ నల్లమిల్లి గాంధీరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కలిదిండి గోపాల కృష్ణంరాజుతో పాటు,కార్యాచరణ సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాతపాటి మురళీ రామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు,కార్యదర్శి మంతెన రామకృష్ణంరాజు, నాయకులు పీవీఎస్ గోపాలకృష్ణంరాజులు మాట్లాడుతూ రైతు ఉద్యమ బాటలో తమతో పాటు నడిచిన రాఘవరెడ్డి నిరంతరం రైతు సమస్యలపై గొంతెత్తే వారని గుర్తు చేసుకున్నారు. ఇనాం భూముల ఉత్పత్తుల ధరలపై పోరాడే వారని వివరిస్తూ నివాళు లర్పించారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు పసల పెద్దకాపు,సభాధ్యక్షులు నల్లమిల్లి గాంధీరెడ్డి, పెంటపాడు గ్రామ మాజీ ఉపసర్పంచ్ నల్లమిల్లి చిన్న గోపిరెడ్డి,ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, రిటైర్డ్ ఇంజనీర్ యాండ్రపు సూర్యప్రకాష్,రిటైర్డ్ ఎంఈఓ ఏవి. రామరాజులు మాట్లాడుతూ రాఘవరెడ్డి రైతులను చైతన్య పరచడానికి వ్యవసాయ శాఖ సైంటిస్టులు,అధికారులతో రైతు సమావేశాలు నిర్వహించే వారని సర్ ఆర్థర్ కాటన్ రైతు క్లబ్ అధ్యక్షులుగా పలు రైతు సేవా కార్యక్రమాలు చేసే వారని గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి పి. మురళీకృష్ణ,ఏవో పార్థసారథి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ రఘురామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాత ప్రభుత్వం పేరుతో మరణ ధృవీకరణ పత్రం జారీ

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం పంచాయతీలో మరణధృవీకరణ పత్రం జారీలో పంచాయతీ సిబ్బంది పొరపాటు వల్ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా వైసిపి ప్రభుత్వం పేరుతో బాధితులకు పత్రం జారీ చేశారు. మృతుని కుటుంబీకులు ప్రశ్నించడంతో ఆ ధృవపత్రాన్ని వెనక్కి తీసుకుని కొత్త సర్టిఫికెట్ సెక్రటరీ జారీ చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన టి నరసాపురానికి చెందిన టిడిపి నాయకులు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మరణ ధృవీకరణ పత్రం కోసం కుటుంబీకులు పంచాయతీలో దరఖాస్తు చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రింట్ ఇచ్చిన సర్టిఫికెట్లో నవరత్నాల పేరుతో జగన్ ఫోటో ఉంది. ఈ విషయం పై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ స్పందించి కంప్యూటర్ ఆపరేటర్ పొరపాటున చూసుకోకుండా పాత ప్రభుత్వం సర్టిఫికెట్ ప్రింట్ ఇచ్చారని వెంటనే ఆ ప్రింట్ సర్టిఫికెట్ రద్దు చేసి మృతుని కుటుంబానికి కొత్త సర్టిఫికెట్ అందించామని తెలిపారు. జగన్ బొమ్మతో కూడిన మరణ ధ్రువీకరణ పత్రాన్ని అందజేసిన విషయం పై ఎంపిడిఓ జి.మణి కుమారి కార్యదర్శిని వివరణ కోరినట్లు చెప్పారు.

కమ్యూనిజం అజేయం

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: కష్టజీవులు శ్రామిక వర్గం ఉన్నంతకాలం కమ్యూనిజం సజీవంగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో సిపిఐ నూతన శాఖ సమావేశం యడ్లపల్లి రమేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు సిపిఐ పతాకాన్ని బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొంత మంది పెట్టుబడిదారీ వర్గాలకు చెందిన వారు కమ్యూనిజానికి కాలం చెల్లిందని ఎర్రజెండా ఎరుపు తగ్గిందని కలలు కంటున్నారని, ఎర్రజెండా ఎరుపు, కమ్యూనిజం సత్తా తగ్గలేదని తెలిపారు. సిపిఐ భారత దేశంలో ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తయి 100వ సంవత్స రంలో అడుగుపెట్టిందని ఆయన తెలి పారు. భారతదేశ స్వాతంత్ర పోరాటంలో, దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత సిపిఐ దేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల స్థాపనకు,మతసామరస్యానికి, దేశ ఐక్యత భారత దేశ సమైక్యత సమగ్రత కోసం అలుపెరగని పోరాటాలు చేసిందని వెంకటేశ్వరరావు తెలిపారు. సిపిఐ మండల కార్యదర్శి గోలిమే బాలయేసు మాట్లాడుతూ మండలంలో పేదల సమస్యల పరిష్కారానికి సిపిఐ క్రియాశీల కంగా పనిచేస్తుందని కార్యకర్తలకు వివరించారు. మండలంలో సీపీఐ అభివృద్ధికి ప్రజాసంఘాల నిర్మాణానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు. తిమ్మాపురంలో సిపిఐ శాఖ ఏర్పాటుకు ముందుకు వచ్చిన సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో పెండ్లి భూషణం, తవిటి కూటి వెంకటేశ్వరరావు,కొప్పుల రామకృష్ణ, ఉండి దుర్గారావు,ఉండి మార్తమ్మ పాల్గొన్నారు. తిమ్మాపురంలో ఇండ్ల స్థలాలు లేని పేదలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇవ్వాలని, గ్రామంలో మంచినీటి, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం, రోడ్లు నిర్మాణం కల్పించాలని సమావేశం నిర్ణయించింది. తిమ్మాపురం గ్రామ సిపిఐ కార్యదర్శిగా యడ్లపల్లి రమేష్‌ను ఎన్నుకున్నారు.

టి.సి.హెచ్.ఆర్. పాలెం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

- పంచాయతీ కార్యదర్శి పై చర్యలకు కమిషనర్‌కు సిఫార్సు
- నిధుల దుర్వినియోగంపై అధికారుల చర్యలు

విశాలాంధ్ర-లింగపాలెం: నిధులు దుర్వినియోగంపై టిసిహెచ్ఆర్ పాలెం పంచాయతీ సర్పంచ్ పి.శోభారాణి చెక్ పవర్ రద్దు చేస్తూ కలెక్టర్ వెట్రి సెల్వి ఇచ్చిన ఆదేశాలను డిపిఓ అనురాధ అమలు చేశారు. ఈ పంచాయతీలో ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులు,పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై జరిగిన విచారణ అనంతరం సర్పంచ్ చెక్ పవర్ ను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నిధులు దుర్వినియోగమైన సమయంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ పై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ కమిషనర్కు సిఫార్సు చేశారు. పంచాయతీలో దాదాపు రూ8 లక్షలు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ నిధులను సర్పంచ్, కార్యదర్శి ఇద్దరు కలిసి పంచాయతీకి జమ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు.ఈ పంచాయతీలో ఇకపై ఆర్థిక నిర్వహణ బాధ్యతలను,చెక్ పవర్ ను మండల పంచాయతీ విస్తరణ అధికారి రత్నకుమార్ కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ వివరాలను లింగపాలెం మండల పరిషత్ కార్యాలయపు అధికారులు తెలిపారు.

అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై దోసిరెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా. కె. సిహెచ్ అప్పారావులతో కలిసి అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో జవాబుదారీ తనంతో ఉండాలని స్పష్టం చేశారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి నిర్దేశించిన సమయంలో పరిష్కారం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టమైన ఆదేశాలను అధికారులకు ఇచ్చారు. కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై దోసిరెడ్డి, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు

విశాలాంధ్ర -భీమవరం: ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ భీమవరం ఏరియా సమితి ఆధ్వర్యంలో భీమవరం యానాదులు కాలనీలో పేదల నుంచి ఇళ్ళ స్థలాల కై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ జగన్ సర్కారు ఇచ్చిన చాలీచాలని ఇళ్ళ స్థలాల బదులు తాము పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెట్లు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు మంజూరు చేయాలని, ఇసుక, సిమెంట్, ఐరన్ ఉచితంగా అందించాలని చెల్లబోయిన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు

విశాలాంధ్ర -భీమవరం: నిబంధనలకు విరుద్ధంగా స్టేషన్ బెయిల్ ఇవ్వడం విరమించుకోవాలని, జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం స్టయి ఫండ్ పెంచాలని, ఇళ్ల స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. ఇటీవల విజయవాడలో జరిగిన ఐఎఎల్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో చెల్లబోయిన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడే వారిపై నిర్బంధాలు విధించడం హేయ మైన చర్య అన్నారు. ఆర్థిక అవసరాల కోసం బ్యాం కుల్లో అప్పులు చేసే బదులుగా న్యాయస్థానంలోనే పరస్పర సహకార బ్యాంకులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. న్యాయవాదుల ముసుగులో కొందరు నకిలీ న్యాయవాదులు సెంటిమెంట్లు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని చెల్లబోయిన కోరారు. ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్ కుమార్ కీలకోప న్యాసం చేశారు. కార్యక్రమంలో ఐఎఎల్ నాయకులు నెక్కంటి క్రాంతి కుమార్, వై.వి.ఆనంద్, ఎం.లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

150 కుట్టుమిషన్లు పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం: రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తనయుడు పులపర్తి ప్రశాంత్ పేరుతో సోమవారం 150 కుట్టు మిషన్ లను మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి మాట్లాడుతూ మహిళలు వారి కాళ్ళ మీద వారు నిలబడాలన్న కృతనిశ్చయంతో రాజ్ ట్రస్ట్ అధినేత గంటా రాజ్ కుమార్ చేస్తున్న సేవలు చిరస్మరణీయం అన్నారు.

రాజ్ ట్రస్ట్ పేద కుటుంబాలకు అండగా నివడం వారి సాధికారతకు కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. అటువంటి సంస్థలకు తమ ప్రభుత్వం సహాయం అందివ్వడానికి ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు ఏలేటి న్యూటన్, కొప్పినీడి శ్రీనివాస్, నల్లం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముడుపులు చెల్లిస్తేనే.. పనులు

విశాలాంధ్ర - సీతానగరం: కార్యాలయంలో పనులు జరగాలి అంటే అడిగినంత ముడుపులు చెల్లిస్తేనే పనులు. మండలంలో సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంకు వెళ్లాలి అంటే నే ప్రజలు బెంబేలు. వివరాల్లోకి వెళితే సుమారు రూ.80వేల ఓటర్లు, 30 వేల హెక్టార్ల సాగు భూమి కలిగిన మండలం సీతానగరం. ఈ మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ మండలంలో క్రయ విక్రయాల, రైతులు బ్యాంకులలో రుణాలు పొందడం సర్వ సాధారణం. అయితే ఈ లావాదేవీలు జరపాల్సిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు తీరు సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంకు ఏ పని కోసం మెట్లు ఎక్కిన లంచం చెల్లించాల్సిందే అని లబ్దిదారులు వాపోతున్నారు. ఈ వాదనలు బలపరుస్తూ కొద్ది నెలలు క్రితం మండల దస్తావేజు లేకరులు పెన్ డౌన్ చేస్తూ రాజమండ్రి, కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల చేయించుకున్నారు. ఆ తరవాత కుదిరిన ఒప్పందంతో ఈ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతు న్నాయి. ఇది ఇలా ఉండగా ఈ కార్యాలయంకు ఎటువంటి సంబంధం లేని ఒక వ్యక్తి చక్రం తిప్పుతూ మామూళ్లు వసూలు చేస్తూ కార్యాలయ సిబ్బందికి అండగా నిలుస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇవన్నీ బలపరుస్తూ సోమవారం ఒక లబ్దిదారులు బ్యాంకు లోన్ దస్త్రాలు స్టాంపు, సంతకం కోసం వెళ్ళగా రూ.100 లు చెల్లించాల్సిన దానికి రూ.600 లంచం తీసుకున్నారని వాపోయాడు. వీటి అన్నింటిపై జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్టర్ దర్యాప్తు చేసి అవినీతికి పాల్పడుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని, అవినీతి రహిత పాలన అందించాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

వారసులకు భూ కేటాయింపుపై కలెక్టర్, జేసీ విచారణ

విశాలాంధ్ర-పెరవలి : కాకరపర్రు గ్రామంలో బి పట్టా, లంక ల్యాండ్, పట్టా భూములు వారసులకు పట్టాలు పంపిణీ చేయాలని వారసులు ద్వారా ఇచ్చిన వినతి మేరకు సోమవారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు తో కలిసి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి గ్రామంలో పర్యటించారు. సంబంధించిన అర్జీ లో పేర్కొన్న సర్వే 60, 61 తదితర సర్వే నంబర్లలో ఉన్న భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ వివరాలను తెలుసుకున్నారు. సంబంధించిన పట్టా భూములు వారసుల వివరాలతో సమగ్ర నివేదిక అందచేయాలని మండల తహసీల్దార్, మండల సర్వే అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, జిల్లా మైన్స్ అధికారిడి ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి బి. లక్ష్మి నారాయణ , తాసిల్దార్ డి. అచ్యుత కుమారి, మండల సర్వేయర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజలనుంచి జిల్లా ఎస్పీ నేరుగా 75 ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించ వలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు వీజీఎ భాస్కరరావు అదనపు ఎస్పీ (పరిపాలన)పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డ్ గ్రహీత మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఉద్యమ సూరీడు, ఆరోగ్యశ్రీ, ప్రజా సంక్షేమము కోసం పోరాడిన యోధుడు మంద కృష్ణ మాదిగకి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెం గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద 30 సంవత్సరముల నుంచి అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమ నేత మంద కృష్ణమాదిగకి శుభాకాంక్షలు తెలుపుతూ పాలాభిషేకను డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ మరియు ఎంఎస్‌పి జిల్లా ప్రదాన కార్యదర్శి గంధం యాకోబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తోత్తరమూడీ శ్రీనివాసరావు, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు, ముప్పిడి పండు ఎంఎస్‌పి మండల అధ్యక్షుడు, లంక ప్రేమ్, సిరిపెల్ల బాబి, సిర్రా సుమన్, సవరపు సత్యనారాయణ, యర్లగడ్డ సత్తయ్య, కౌలరి శ్రీను, కొమ్మర సత్యనారాయణ, గ్రామ యువకులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రతి ఒక్కరూ వృత్తిని నైపుణ్యాన్ని పెంపొందించుకొని జీవితములో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. దేవరపల్లిలో సోమవారానాడు ఎలక్ట్రీషన్ డే సందర్భంగా దేవరపల్లి మండల ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ యూనియన్ సభ్యులు కష్టపడి పని చేసి వృత్తికి న్యాయం చేయాలన్నారు. ఎలక్ట్రికల్స్ అండ్ ప్లంబర్ సభ్యులకు సూచనలు ఇస్తూ ప్రభుత్వ పరంగా వచ్చే పనులను మీకు అప్పగిస్తానన్నారు. ముఖ్యంగా గోదావరి పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వ పరంగా పనులు ఉంటే తాను మీ యూనియన్‌కు పనులు వచ్చే విధంగా అధికారులకు తో సంప్రదించి మీకు న్యాయం చేస్తానన్నారు. దేవరపల్లి మండలంలో ఎలక్ట్రికల్ మరియు ప్లంబర్ యూనియన్‌కు భవనం నిర్మించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ జోన్ ఏర్పాటు చేసే దిశగా తాను ప్రయత్నాలు చేస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్, టీడీపీ నాయకుడు ఉప్పులూరి రామారావు, ద్వారకాతిరుమ, మండలం టీడీపీ అధ్యక్షుడు లంక సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు సంఘం అధ్యక్షుడు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ యూనియన్ అధ్యక్షుడు బిఎస్ఆర్ కృష్ణ, గౌరవ అధ్యక్షుడు అపసాని రామకృష్ణ ,ఉపాధ్యక్షుడు జె బాబురావు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకేలో ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం ఐఐపి & టి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సెనేట్ హాలులో మెకానికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులకు (పురుష) తిరుచ్చిలోని సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ముందుగా సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణని, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్‌లను విసి ఛాంబర్ నందు కలువగా జెఎన్‌టియుకెతో పాటు డిగ్రీ కళాశాలల నుండి ఇంట ర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో తిరుచ్చి నుండి సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఐఐపి&టి డైరెక్టర్ ప్రొ బిటి కృష్ణ తెలిపారు. జెఎన్‌టియుకె మరియు డిగ్రీ కళాశాలల నుండి సుమారుగా 120 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా మెకానికల్ ఇంజనీరింగ్ 7, కెమికల్ ఇంజనీరింగ్ 10, కెమిస్ట్రీ 9, సేఫ్టీ నుండి ఒకరిని మొత్తంగా 27మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు దేశంలోని కంపెనీకి సంబంధించిన 35 ప్రాజెక్టులలో ఎక్కడైనా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థులకు ఐఐపి & టి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో సెనేట్ హాలులో వ్రాత పరీక్ష నిర్వహించి ప్లేస్‌మెంట్ ఆఫీస్ మరియు సెనేట్ హాలు నందు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్, సాయి పవర్ అండ్ ఎక్విప్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ సాయి పవార్, హెచ్ఆర్ మేనేజర్ ఎన్ గోపి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ హెచ్ఆర్ ఏ రిచర్డ్, ప్లేస్‌మెంట్ పోకస్-ఫౌండర్ కె మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

నట్టల నివారణకు మందుల పంపిణీ

విశాలాంధ్ర - చాగల్లు : తూర్పు గోదావరి జిల్లా, చాగల్లు మండలం, దారవరం గ్రామంలో సోమవారం పశు వైద్య అధికారి ముఖేష్ ఆధ్వర్యంలో ఆరోగ్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు, దూడలకు, కోళ్లకు నట్టల నివారణ మందులు, లంపి చర్మ వ్యాధి, గొంతువాపు వ్యాధి, కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేయడం, గర్భకోశ వ్యాధుల చికిత్స, చూడు పరీక్షలు, చేయడం జరిగిందన్నారు. పాడిరైతులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీడీవో నాతి బుజ్జికు సన్మానం

విశాలాంధ్ర - గండేపల్లి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో నాతి బుజ్జిను గండేపల్లి మండలానికి సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఘనంగా సత్కరించి సన్మానించారు. నాతి బుజ్జికు అత్యుత్తమ సేవలకు గాను ఉత్తమ పురస్కార అవార్డు లభించింది. ఆమెకు మండల కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రరావు, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

విశాలాంధ్ర -కొవ్వూరు : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీరు, డ్రైనేజీ, వీధి లైట్లు పూర్తిస్థాయిలో అందించడంపై దృష్టి పెట్టాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో దోమలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దోమలను నిర్మూలించడంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రజలకు తాగునీరు అందించడంలో వీధి దీపాలను వెలిగించడంలో మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో చైర్పర్సన్ భావన రత్నకుమారి కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ అన్న క్యాంటీన్‌కు గోకవరం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు సహాయాన్ని అందించగా, టీడీపీ కాకినాడ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చాలన్న ఉద్దేశ్యంతో గత మూడు సంవత్సరాలుగా టీడీపీ నాయకుల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, జాస్తి వసంత్, గద్దం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని మర్రిపాకలో సోమవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు వినోద్ కుమార్ పశువులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేదెలకు, ఆవులకు, మేకలకు, గొర్రెలకు ఉచితంగా అవసరమైన మందులు పంపిణీ చేశామన్నారు. ఈ ఉచిత పశు ఆరోగ్య శిబిరం రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జగతం ఆనందరావు, ఎంపీటీసీ శివ రామకృష్ణ, యానిమల్ హస్బెండ్ అసిస్టెంట్ హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కన్నబాబు పరామర్శ

విశాలాంధ్ర - కరప : కరప గ్రామంలో ఇటీవల కాలంలో మృతి చెందిన సిద్ది లలిత శశాంక్ మౌళి కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి కురసాల కన్నబాబు పరామర్శించారు. బాధితుడుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి కుటుంబం పట్ల కన్నబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చింత ఈశ్వరరావు, చింత బుజ్జి, నక్కసత్తిబాబు, గొర్రెల వెంకన్న, చోడపునీడి వెంకటరమణ, మేడిశెట్టి సత్తిబాబు, ముద్రగడ వీరబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆలమూరు : రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు, పశుపోషకులకు అండగా నిలుస్తూ ఏర్పాటు చేస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా ఎల్ అనిత వ్యాఖ్యానించారు. సూర్యారావుపేటలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి,కూటమి నాయకులు, సీనియర్ టీడీపీ నాయకులు కాలా సాయిబాబా, కాలా ప్రసాద్,కాలా జయరాజు, బొంతు రామకృష్ణ, లొల్ల తిరుపతిరావు, కాలా సూరిబాబు ప్రారంభించారు. గుమ్మిలేరు పశువైద్యులు డా సుభాష్ చంద్ర, చింతలూరు పశు వైద్యాధికారి రామకృష్ణలు పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరం ద్వారా వైద్యం చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు ప్రకాష్, రమేష్, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి: కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి కమిషనర్ భావన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 15 మంది డయల్ యువర్ కమిషనర్ నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను అధికారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని..పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ 32కిపైగా సమస్యలపై అర్జీలు అందాయి. వాటిపై కమిషనర్ భావన సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె మనోహర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, కార్పొరేషన్ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి : జేసీ

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం(పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు,జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, కేఎస్ఈజెడ్ ఎస్డీసీ కెవీ రామలక్ష్మి, సీపీవో పీ త్రినాథ్ ఇతర అధికారులతో కలిసి హాజరై, కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు చేయాలన్నారు. మొత్తం-364 అర్జీలు అందాయి. జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీజీ ఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. తప్పనిసరిగా అర్జీలను నిర్ణిత గడువులోగా పరిష్కరించి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు చేయాలని జేసీ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభిచాలని వినతి

విశాలాంధ్ర - కరప : కరప మండలం తుల్యభాగ డ్రైన్ నందు ఏండ్లు తరబడి నిలిచిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించి రైతులకు నీరు అందించాలని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ సోమవారం కలెక్టర్‌ను కలిసి రైతులతో వినత పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ కొంగోడు, వేములవాడ, గొర్రిపూడి గ్రామాల రైతులకు ఈ ప్రాజెక్టు ద్వారా మేలు చేకూరుతుందని నానాజీ తెలిపారు. గతంలో ఈ ప్రాజెక్టు పనులు కొంతవరకు చేసి జాప్యం చేయడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆయన కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ స్పందించి త్వరితగతిని లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే నానాజీకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి, నాయకులు మేడిశెట్టి సుబ్బరాజు గొర్రిపూడి, వేములవాడ, గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

గడియార స్తంభం పనులు పరిశీలన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట స్టేషన్ సెంటర్లో రింగ్ సెంటర్ వద్ద నిర్మిస్తున్న గడియారపు స్తంభాన్ని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య పరిశీలించారు. ఈ గడియారం స్తంభం 2019లో నిమ్మకాయల చినరాజప్ప ఉప ఉపముఖ్యమంత్రిగా ఉండగా అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించినప్పటికీ గత ప్రభుత్వంలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోక అలాగే ఉండిపోయింది మళ్ళీ అధికారంలోకి వచ్చి చినరాజప్ప అత్యంత వేగంగా ఈ పనులు పూర్తి చేసేందుకు నిధులను తీసుకొస్తున్నారు. గత నెల రోజులుగా నిర్మిస్తున్న ఈ గడియారం స్తంభంలో పెద్ద గడియారంను సోమవారం ఏర్పాటు చేస్తుండగా మునిసిపల్ కమిషనర్ శ్రీవిద్య దగ్గరుండి పర్యవేక్షించారు. కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ ఈ గడియారం స్తంభం వద్ద ఐలవ్ సామర్లకోట బోర్డును ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలియజేశారు.

మద్యం అమ్మకాలు దారుణం

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు భారత రాజ్యాంగ దినోత్సవం రోజున పిఠాపురం నియోజకవర్గం విచ్చలవిడిగా ఎమ్మార్పీ రేటుకు మించి మద్యం అమ్మకాలు జరిపారని రాజ్యాంగం సాక్షిగా రాజ్యాంగానికి అవమానం అని మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ ఎన్ సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జన విజ్ఞాన వేదిక మద్యం, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ పేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు వేమగిరి తరుణ్, ఎన్ సూర్యనారాయణ మాట్లాడరు ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూడవద్దని, మద్యం కారణంగా అనేక కుటుంబాలు విచ్చిన్నం అవుతున్నాయన్నారు.

మద్యపానానికి బానిసలై ఆరోగ్యాన్ని, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రజల యొక్క శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సంపూర్ణ మద్యపాన నిషేధం వైపు ప్రభుత్వాలు ఆలోచన చేయాలని కోరారు. మద్యం, మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు గుర్రాల ప్రసాద్, కరణం విశ్వనాథం, వేమగిరి రాజేంద్ర కుమార్, కే సింహచలం, సాల్మన్ రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, లోవరాజు, వడ్డీకాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్

విశాలాంధ్ర - పెద్దాపురం : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికై ప్రతీ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పెద్దాపురం ఆర్డీవో కార్యాలయ ఏవో కెవి మాధవరావు అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్లో ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఏఓ మాధవరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతీ అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్దేశ్యంతో డివిజన్ స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం నిర్వహించిన స్పందనకు ఆయా అంశాలపై ఎనిమిది ఫిర్యాదులు అందాయన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించడం జరిగిందని మాదవరావు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, దయాదనందరాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి ప్రోత్సాహక బహుమతులు :సూర్యచంద్ర

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : విద్యార్థుల దినదినాభివృద్ధి కోసమే ప్రోత్సాహక బహుమతులు ప్రకటించడం జరిగిందని పాఠంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడి హైస్కూల్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సూర్యచంద్ర మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పుడున్న గ్రేడ్ నుంచి పై గ్రేడుకు జనవరి 26 నాటికి ఎవరైతే వెళ్తారో వారికి బహుమతులు ఇస్తామని ఆగస్టు 15న ప్రకటించడం జరిగిందన్నారు. ఈ స్కూల్లో 369 విద్యార్థులు ఉంటే వారిలో 126 మందిపై గ్రేడ్‌కు వెళ్ళి బహుమతులు సాధించారన్నారు. అలాగే అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరోజు స్కూల్ మానకుండా వచ్చిన విద్యార్థికి బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. మిగిలిన విద్యార్థులు ఇదే విధంగా తయారుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వైసీపీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డు తప్పనిసరిగా నమోదు : ఎంపీడీవో

విశాలాంధ్ర - గండేపల్లి : ఆరు సంవత్సరాల పిల్లలకు ఆధార్ కార్డు తప్పనిసరిగా నమోదు చేయించాలని ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలో ఉన్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు, అంగన్వాడీ టీచర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆధార్ కార్డు లేని పిల్లలకు ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ల ద్వారా కొత్తగా ఎన్‌రోల్ చేయించవలసినదిగా ఆదేశించారు. ఇప్పటికే ఆధార్ కార్డు ఉన్న వారికి ఆధార్ నెంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జనన ధ్రువపత్రం లేని వారికి వెంటనే నమోదు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగ పార్వతి మండల సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ షాపులో రెండు లక్షల నగదు చోరీ

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, జేగురుపాడు గ్రామ పంచాయతీ కాంప్లెక్స్‌లో ఉన్న సతీష్ మెడికల్ అండ్ జనరల్ షాపు తాళాలు పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు రెండు లక్షలు నగదు దొంగిలించుకు పోయారు. మండలంలోని దుళ్ళ గ్రామానికి చెందిన గుంటూరి సతీష్ జేగురుపాడులో కొన్నేళ్లుగా మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఒక వ్యక్తికి తాను ఇవ్వడం నిమిత్తం నగదు షాపులో ఉంచి యధావిధిగా ఆదివారం రాత్రి షాపు కట్టేసి ఇంటికి వెళ్లినట్లు, అనంతరం షాపు తాళాలు పగలు కొట్టి రెండు లక్షల రూపాయల నగదును గుర్తు తెలియని దుండగులు దొంగలించారని సతీష్ పోలీసు వారికి సమాచారం ఇచ్చారు. కడియం క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ ఎమ్ సురేష్ ఆధ్వర్యంలో క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని సోమవారం పరిశీలించారు. దగ్గరలోని మరో షాపులో దొంగతనానికి ప్రయత్నించి విఫలమయి నట్లు సమాచారం. దగ్గరలోని ఒక పశువుల షెడ్డు వద్ద ఉన్న సీసీ కెమెరాలు దుండగులు పగులగొట్టారు. ఈ దర్యాప్తులో క్రైమ్ కానిస్టేబుల్ గంటా రవికుమార్ ఉన్నారు.

నన్నయ అనుబంధ కళాశాల అధ్యక్షుడిగా మహమ్మద్ హబీబ్ బాషా

విశాలాంధ్ర - రాజానగరం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల అధ్యక్షుడిగా మహమ్మద్ హబీబ్ బాషా ఎన్నికయ్యారు. మండలంలోని నన్నయ వర్సిటీలో సోమవారం జరిగిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల జనరల్ బాడీ ఎన్నికల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.దీనిలో భాగంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అనుబంధ డిగ్రీ,పీజీ కళాశాలల నూతన అధ్యక్షుడిగా మహమ్మద్ హబీబ్ బాషా,గౌరవ అధ్యక్షులుగా గంధం నారాయణరావు, కార్యదర్శిగా ఎన్.కనకయ్య, ఉపాధ్యక్షులుగా జి. బ్రహ్మాజి ,ఆకుల నాయుడు, కోశాధికారిగా ఎం. నాగబాబులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు హబీబ్ భాష మాట్లాడుతూ నన్నయ అనుబంధ కళాశాలలా అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తామన్నారు. దీనిలో భాగంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించి సత్కరించారు.

దస్తావేజులు పోయినవి

పిఠాపురం స.రి. వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన నెం. 4579/2013 రు గాగల నా తాలూకు ఒరిజినల్ ఫారీకత్తు దస్తావేజు చిత్రాడ నుండి పిఠాపురం బ్యాంక్ లో లోన్ కోసం తీసుకెళ్లుచుండగా ఆటోలో పోయినవి. సదరు దస్తావేజు దొరికినవారు క్రింది నంబరుకు ఫోను చేసి అందించినచో తగు పారితోషికం ఇవ్వబడును.

Contact: 99593 99807

అభివృద్ధిని అడ్డుకుంటే ఉపేక్షించం: ఎమ్మెల్యే గోరంట్ల

విశాలాంధ్ర - కడియం : గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకుంటే ఉపేక్షించేది లేదని, ప్రజలకు ఉపయోగపడే పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. కడియం మండలం దుళ్ళ గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ ప్రాంతాన్ని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తో కలిసి పరిశీలించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలందరికీ మంచినీటి సమస్య తీర్చే విధంగా రూ.59 లక్షల అంచనాలతో ప్రారంభించిన వాటర్ ట్యాంక్ పనులు కొంతమంది స్థానిక స్వార్ధపరులు సదరు ట్యాంకు నిర్మాణం జరుగుతున్న స్థలంపై కోర్టుకి వెళ్లడం వలన ఆగిపోయిందని, ఇప్పటికే గ్రామంలో రెండు కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేసి 240 ఇళ్లకు టాప్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. సదరు స్థల వివాద విషయమై సంబంధిత శాఖల అధికారులను పిలిపించి వివరణ కోరగా ట్యాంకు నిర్మాణం ఉన్న ప్రదేశం గ్రామ కంటానికి చెందిన ప్రభుత్వ భూమి అని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఇది ప్రభుత్వ భూమి అని తేలినందున ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని, సత్వరమే యుద్ద ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలని, మిగిలిన భూమిని సర్వే చేసి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే చెముడులంక నుండి దుళ్ళకు వెళ్ళు రోడ్డులో పంట కాలువ చాలాచోట్ల ఆక్రమణకు గురి అయిందని, గుర్తించి వెంటనే ఆక్రమణలు తొలగించాలని, పంట కాలువ ద్వారా రైతులకు సకాలంలో నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులకు సూచించారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, ముమ్మిడి దేవి నాగేశ్వరరావు, గుర్రపు సత్యనారాయణ మరియు పలు శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహం సందర్శన

విశాలాంధ్ర - గోపాలపురం : వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో భాగంగా హాస్టల్ మరమ్మతులు చేపట్టినట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ శోభారాణి తెలిపారు. సోమవారం శిధిలావస్థలో ఉన్న స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని ఆమె సిబ్బందితో పాటు సందర్శించారు. ఇప్పటికే ఈ హాస్టల్ శిథిలావస్థాకు చేరి ఇందులో చదువుతున్న విద్యార్థులు హై స్కూల్‌కి ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు భవనములో తాత్కాలిక వసతి గృహాన్ని నిర్వహిస్తున్న సంగతి విధితమే. హాస్టల్ అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఇందులో భాగంగా గోపాలపురం బాలుర వసతి గృహానికి సుమారు రూ.23.51 లక్షలు, మంజూరు చేసిందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని చిన్నాయగూడెం బాలికల వసతి గృహానికి రూ.24.79 లక్షలు, ఎర్నగూడెం బాలికల వసతి గృహానికి 10.33 లక్షలు, దుద్దుకూరు బాలికల వసతిగృహానికి 26.3లక్షలు, రాజంపాలెం బాలికల వసతికి 10.65 లక్షలు, రేగులగుంట బాలుర వసతికి 9.62 లక్షలు, నల్లజర్లలోని ఆనంద నిలయం బాలుర వసతికి రూ.7.35 లక్షలు, ఎర్నగూడెం బాలుర వసతికి రూ.10.35 లక్షలు, గౌరీపట్నం బాలుర వసతి గృహానికి రూ.15.35 లక్షలు, దేవరపల్లి బాలుర వసతికి రూ.6.19 లక్షలు మరమ్మత్తుల నిమిత్తం మంజూరు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటయోధుడు మచ్చా మురళి వర్ధంతి

విశాలాంధ్ర - యానాం : యానాం రీజెన్సీ వర్కర్స్ యూనియన్ పోరాటయోధుడు మచ్చా మురళీమోహన్ 13వ వర్ధంతిని కార్మికులు పెద్ద ఎత్తున యానాం చేరుకుని ఘనంగా నివాళులర్పించారు. ముందుగా మురళీమోహన్ సతీమణి దుర్గ చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మురళీమోహన్ చిత్రపటానికి మురళీ కుటుంబ సభ్యులచే పూలమాలవేసి నివాళులు ర్పించారు. యూనియన్ అధ్యక్షుడు బి సూర్య భగవాన్, కార్యదర్శి ఏవివి సత్యనారాయణ ,సాంబశివరావు, , దుర్గా ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కి కార్మికులకు ఇచ్చిన సైట్‌లో రీజెన్సీ యాజమాన్యం చేయవలసిన పనులను త్వరగా పూర్తి చేయాలని వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం దరియల తిప్పులో కార్మికులకు ఇచ్చిన సైట్లు వద్ద కార్మికులు జనరల్ బాడీ సమావేశం జరుపుకున్నారు. రీజెన్సీ పరిశ్రమ త్వరగా తెరవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రాజ్, వర్మ, రామేశ్వరరావు, మురళీమోహన్, దుర్గయ్య, గొంగుల నాగేశ్వరరావు, నక్కా రామకృష్ణ, రాంబాబు, గుడాల సత్యనారాయణ, మలకా వెంకటరమణ పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాల విలీనం నిలిపివేయాలని వినతి

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు ఎస్సీ కాలనీలోని చర్చి వీధి ఎంపీపీ పాఠశాలను గ్రామం మధ్యలోని పాఠశాలలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఆలమూరు సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, ఎస్సీ నాయకులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ పాఠశాలలో 42 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ పాఠశాలను విలీనం చేయబోయే పాఠశాలకు వీరు చేరుకోవాలంటే మధ్యలో రావులపాలెం-కాకినాడ ప్రధాన రహదారిని దాటాల్సి ఉంటుందని, దీనివల్ల విద్యార్థులు ప్రమాదాలకు లోనయ్యే అవకాశం ఉందని వారు ఆ వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆలమూరులోని కండ్రిగలో ఉన్న పాఠశాల, శెట్టిబలిజ రామాలయం సమీపంలో ఉన్న పాఠశాలలు అతి సమీపంలో ఉన్నాయి. ఎక్కడో దూరంగా ఉన్న ఎస్సీ కాలనీలోని పాఠశాలను ఈ విలీన ప్రక్రియలో భాగస్వామ్యం చేయడంపై ఇప్పటికే స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. మండల విద్యాశాఖ అధికారులు ఈ అంశంపై ఏ విధమైన నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

పీవీవీ సింహాచలంకు అవార్డు

విశాలాంధ్ర - రౌతులపూడి : కోటనందూరు సెక్షన్ మీటర్ రీడర్‌గా పనిచేస్తున్న పసగడుగుల రమణికి 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అతను చేసిన సేవలు గుర్తించి కాకినాడ సర్కిల్ ఆఫీసర్ డి ప్రసాద్ చేతులు మీదుగా అవార్డు ఇవ్వడం జరిగిందని జగ్గంపేట డివిజన్ యూనియన్ ప్రెసిడెంట్ పసగడుగుల నానాజీ, సెక్రెటరీ సతీష్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారు అభినందలు తెలిపారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం కడియపులంక 'శ్రీ ప్రగతి విద్యానికేతన్' కరస్పాండెంట్ కర్రి యోహాన్ తన పుట్టినరోజును పురస్కరించుకొని కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు అందజేశారు. సోమవారం ఆయన మాధవరాయుడు పాలెం పంచాయతీ శివారు చైతన్య నగర్ సమీపానగల లెప్రసీ కాలనీకి వెళ్లి అక్కడ గల రోగులకు దుప్పట్లు అందజేసి భోజనం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా యోహాను మాట్లాడుతూ, ఈ ప్రపంచంలో ప్రతి జీవి భగవంతుని సృష్టేనని, వైకల్యం కలిగిన వారి పట్ల, రోగగ్రస్తుల పట్ల చిన్న చూపు తగదన్నారు. తన ప్రతి పుట్టినరోజు నాడు పేద, బీదలకు తనకు చేతనైన సాయ మందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే తమ విద్యాసంస్థలో కొంతమంది పేద విద్యార్థులకు నామ మాత్రపు ఫీజుతో విద్యను అందిస్తున్నామన్నారు.

ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర - కడియం : కడియం దేవి చౌక్ సెంటర్ నుండి పడాల వారి వీధికి వెళ్లే రోడ్డు ప్రక్క ఆక్రమణలు తొలగింపు పనులను సోమవారం కడియం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కడియంలో పలుచోట్ల రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయని, దానివల్ల రోడ్లు ఇరుకుగా మారి, వాహనదారులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. ఆక్రమణలు తొలగించాలని జనవరి మొదటి వారంలోనే తెలియజేశామన్నారు. వారు తొలగించని కారణంగా, తాము తొలగించే చర్యలు చేపట్టినట్టు సెక్రటరీ తెలిపారు. కడియం హైస్కూల్ రోడ్డులో డ్రైనేజీలపై నిర్మాణం చేసిన వ్యాపారులకు సమయం ఇచ్చామని, వారు స్వచ్ఛందంగా తొలగించకపోతే పంచాయతీ సిబ్బందితో అక్కడ కూడా తొలగిస్తామని తెలిపారు. గ్రామంలో ఎవరైనా పంచాయతీ స్థలాలలో ఎటువంటి ఆక్రమణలు చేపట్టినా చర్యలు తప్పవని ఆయన తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

విశాలాంధ్ర - ఆలమూరు : ఒకరు హైదరాబాదులో మరొకరు అమెరికాలో స్థిరపడినా స్వగ్రామాన్ని మర్చిపోకుండా గొడవర్తి సత్యనారాయణమూర్తి, గొడవర్తి వినయ్ కుమార్‌లు సేవలు అభినందనీయమని తెలుగుదేశం యువ నాయకుడు బండారు సంజీవ్ వ్యాఖ్యానించారు. సోమవారం జొన్నాడలో గొడవర్తి సత్యనారాయణమూర్తి ఆయన కుమారుడు వినయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కపిలేశ్వరపురంలోని డాక్టర్ ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్యులతో ఏర్పాటు చేసిన ఈ కంటి వైద్య శిబిరంలో 210 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 45 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేయగా 15 మందిని ఆసుపత్రికి తరలించారు. వందమందికి ఉచితంగా కళ్లజోళ్లను, మందులు, కంటి అరుకలను పంపిణీ చేశారు. గ్రామ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాయల్ బూమ్ బాక్స్ మూడవ ఎడిషన్‌ను ప్రారంభం

విశాలాంధ్ర-రాజమండ్రి: లివింగ్ ఇట్ లార్జ్' యొక్క స్ఫూర్తిని సంబరం చేస్తూ, సీగ్రామ్ రాయల్ స్టాగ్ హైదరాబాద్, తెలంగాణాలో బౌల్డర్ హిల్స్‌లో జనవరి 25న గొప్ప ప్రదర్శనతో రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మూడవ ఎడిషన్ యొక్క ఎంతగానో ఊహించిన ప్రారంభాన్ని సూచించింది. ఇంతకు ముందు ఎడిషన్స్ యొక్క విజయాలు ఆధారంగా రూపొందించబడిన ఈ ఏడాది ఫెస్టివల్ ఉత్తమమైన మ్యూజిక్ మరియు గేమింగ్ వినోదాన్ని ఒక చోటకు తీసుకురావడం ద్వారా మరింతగా ఆధిక్యతను సంపాదించింది. భారతదేశపు అత్యంత విజయవంతులైన కళాకారుల ద్వారా పెర్ఫార్మెన్స్‌లను అనుభవించడానికి వేలాది ఔత్సాహికులు ఒక చోట చేరడంతో ఈ సాయంత్రం అనూహ్యమైన ప్రతిస్పందనను పొందింది. ఈ కార్యక్రమం ఉత్సాహవంతమైన మ్యూజిక్ , ఉల్లాసవంతమైన పెర్ఫార్మెన్స్ లు మరియు సాటిలేని ఉత్సాహం యొక్క గుర్తుండిపోయే నైట్ ను అందచేసింది. బౌల్డర్ హిల్స్ విశాలమైన మైదానాలు ఆకర్షణీయమైన ఇన్ స్టలేషన్స్, లీనమయ్యే కళ ప్రదర్శనలు, కూర్చబడిన ఆహారపు అనుభవాలు, ఇంటరాక్టివ్ జోన్స్‌తో ఉల్లాసకరంగా మారాయి, కేవలం మ్యూజిక్ మాత్రమే కాకుండా వివిధ రకాల సంబరాలను సృష్టించింది. ఉత్సాహవంతమైన డిజే యోగితో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఆ రోజు కార్యక్రమానికి యోగి తో పాటూ ర్యాప్ శైలి రఫ్తార్ వేదిక పై చోటు చేసుకోవడంతో ఉత్సాహం రెట్టింపయ్యింది. తదుపరి విలక్షణమైన వోకలిస్ట్ నిఖితా గాంధీ ద్వారా అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ప్రదర్శితమైంది. ఈ గ్రాండ్ ఫినాలే లో మ్యూజిక్ దిగ్గజం అమిత్ త్రివేది వైభవోపేతమైన ముగింపు చర్య ఫెస్టివల్ యొక్క విభిన్నమైన మ్యూజికల్ శైలుల యొక్క సిగ్నేచర్ మిశ్రమానికి పరిపూర్ణమైన చిహ్నంగా నిలిచింది, జనరేషన్ లార్జ్ కోసం గుర్తుండిపోయే అనుభవాన్ని సృష్టించింది.

ఏపీ రాజకీయాల్లో 'యువగళం' చెరగని ముద్ర : వర్మ

విశాలాంధ్ర - పిఠాపురం : ఏపీ రాజకీయంలో యువగళం చెరగని ముద్ర అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ అన్నారు. వైసీపీ అయిదేళ్ల అరాచక పాలనపై సమరశంఖం పూరించిన రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన చారిత్రాత్మక యువగళం పాదయాత్ర ప్రారంభమై నేటికి రెండేళ్లు పూర్తయింది. రాష్ట్రంలో 5కోట్లమంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ కుప్పం వరదరాజస్వామి పాదాల చెంతనుంచి 2023 జనవరి 27వ తేదీన పాదయాత్రగా ప్రజల్లోకి వెళ్లిన యువనేత నారా లోకేష్ యువగళంతో రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్నే మార్చేశారన్నారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, మున్సిపాలిటీలు 2,097 గ్రామాల మీదుగా 226 రోజులపాటు 3132 కి.మీ.ల మేర యువగళం పాదయాత్ర సాగింది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకలించి, ప్రజాప్రభుత్వాన్ని స్థాపించడంలో యువగళం కీలకపాత్ర పోషించింది. యువగళం పాదయాత్రలో యువనేత లోకేష్ 70 బహిరంగ సభలు, 155 ముఖాముఖి సమావేశాలు, 12 ప్రత్యేక కార్యక్రమాలు, 8రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. 226 రోజుల సుదీర్ఘ పాదయాత్రలో కోటిన్నర మంది యువనేతతో కనెక్ట్ అయ్యారన్నారు. ఉభయగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో జేజేలు : చైతన్యానికి మారుపేరైన ఉభయగోదావరి జిల్లాల్లో 17 నియోజకవర్గాల పరిధిలో 23 రోజులపాటు సాగిన యువగళం పాదయాత్ర జనజాతరను తలపించిందన్నారు. పాదయాత్రలో యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రజాప్రభుత్వం అడుగులు వేస్తోందని వర్మ అన్నారు.

రాష్ట్రానికి భారీ పెట్టుబడులు : మంత్రి

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బృందం నాలుగు రోజులపాటు దావోస్ విస్తృత పర్యటనల ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. భారీ పెట్టుబడులు ఆకర్షణ, స్వర్ణాంధ్ర- 2047 లక్ష్యంగా చేపట్టిన ఈ పర్యటనతో దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రకు తరలి వస్తారని మంత్రి సుభాష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచి, రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై సుదీర్ఘ చర్చలు జరిగిన నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి చెందటం ఖాయమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. దావోస్‌లో వివిధ వాణిజ్య రంగాలకు చెందిన 15 దిగ్గజ కంపెనీలతో జరిగిన చర్చలు ఫలప్రదం కానున్నాయని అన్నారు. కొత్త పారిశ్రామిక విధానాల్లో సౌలభ్యత, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఇచ్చే ప్రోత్సాహాలు తదితర వెసులుబాటు సౌకర్యాలు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు వస్తాయని మంత్రి సుభాష్ వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, నిరుద్యోగ నిర్మూలన లక్ష్యంగా అలుపెరగని కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌కు మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇళ్ల స్థలాల దరఖాస్తు కార్యక్రమం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నియోజకవర్గపార్టీ కార్యాలయంలో సోమవారం సీపీఐ ప్రధాన కార్యదర్శి శీలం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల సత్తిబాబు బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల స్థలాలు మంజూరు కొరకు దరఖాస్తు నమోదు కార్యక్రమం ముమ్మిడివరం సమైక్యాంధ్ర శిబిరం వద్ద సీపీఐ పార్టీ నిర్వహిస్తుందని, నగరపాలక పరిధిలో 20 వార్డుల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నిమ్మకాయ శ్రీనివాసరావు మాట్లాడుతూ సఫారీ కర్మచారి మిషన్ చైర్మన్ అధికారిక ఆదేశములు మేరకు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మున్సిపల్ కమిషనర్లు అందరూ అమలు చేయాలని, పారిశుధ్య కార్మికులకు నివాస స్థలాలు కేటాయించి సొంత ఇంటి కల సాకారం కొరకు ధరఖాస్తులు స్వీకరించాలన్నారు. 28న ముమ్మిడి వరం గరపాలికలో 20 వార్డుల్లో ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తామని, 29 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక సమైక్యాంధ్ర శిబిరం వద్ద ఇండ్ల స్థలాలు మంజూరు కొరకు దరఖాస్తులు నమోదు కార్యక్రమం పార్టీ ప్రజా సంఘాల శ్రేణులు చేపట్టాలన్నారు. ఫిబ్రవరి 9 వరకు కొనసాగిస్తున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ ఇండ్ల స్థలం లేనివారు, స్థలంఉండి ఇల్లు నిర్మాణానికి 5 లక్షలకు, ఇల్లు స్థలం పట్టాలు కొరకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సంతాప కార్యక్రమంలో ముమ్మిడివరం వీఆర్ఎ దివి కనకదుర్గరావు అకాల మృతికి సమావేశం దిగ్భ్రాంతి వ్యక్త చేశారు.

తక్షణమే అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి ఏలూరు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వారా స్వీకరించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిజిఆర్ఎస్ అర్జీలను ప్రజలనుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ 232 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను వివిధ శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి వారి సిబ్బందితో త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటక కళా పరిషత్ పోటీలు

విశాలాంధ్ర - పెద్దాపురం : జిల్లాలోని పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో మూడు రోజులుగా స్నేహ ఆర్ట్స్ ఉభయ తెలుగు రాష్ట్రాల షష్టమ నాటక కళా పరిషత్ పోటీల్లో ఉత్తమ నాటికగా 'స్వేచ్ఛ ' ప్రథమ బహుమతి సాధించింది. స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశీ రాజా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఏడు నాటికలను ప్రదర్శించారు. ఈ నాటికల్లో హైదరాబాద్ విశ్వశాంతి క్రియేషన్స్ ప్రదర్శించిన 'స్వేచ్ఛ' ప్రథమ బహుమతిని సాధించింది. రెండవ బహుమతిగా హైదరాబాదు మిత్ర ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన 'ఇది రహదారి కాదు మూడవ బహుమతిగా గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారిచే 'చిగురుమేఘం' నాటిక తృతీయ స్థానం సాధించింది. అలాగే ఉత్తమ నటుడిగా డాక్టర్ వెంకట్ గోకాడ (స్వేచ్ఛ), ఉత్తమ నటిగా వాగ్దేవి (రాత), ఉత్తమ రచన ఆకురాతి బాస్కర్ (ఇది రహదారి కాదు), ఉత్తమ దర్శకత్వం బివిన్ రెడ్డి (స్వేచ్ఛ), ఉత్తమ రంగాలంకరణ ఫణి (స్వేచ్ఛ), ఉత్తమ ఆహార్యం పి.వేశవ, ఉత్తమ సంగీతం సురభి నాగరాజులు ఎంపిక కాగా ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కె.శాంతారావు. గోగులపాటి సీతారామస్వామి. డి రాధాకృష్ణలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశి రాజా. సీఐటియు నాయకులు డి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ. స్నేహ ఆర్ట్స్ సభ్యులు వెన్నా పండు. నూకలమంతి నానాజీ, నానాజీల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. కేదారి నాగు, ఎం సత్తిబాబు, పాలాని సత్తిబాబు. దేవాడ పాపేశ్వరరావు, కంటిబోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్ ప్రసాద్‌కు సత్కారం

విశాలాంధ్ర - రాజోలు : రిపబ్లిక్ డేట్ సందర్భంగా జిల్లా కేంద్రం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో రాజోలు తహసీల్దార్ ఎన్ఎస్ఎన్ ప్రసాద్ ఉత్తమ తహసీల్దార్‌గా జిల్లా కలెక్టర్ మహేష్ చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్నారు. జనవరి 25 ఓటర్లు డే సందర్భంగా బి సావరం వీఆర్వో రాజ్ తరుణ్ బెస్ట్ BLOగా విజయవాడ ఎలక్షన్ కమీషనర్ నుంచి స్టేట్ అవార్డు అందుకున్నాడు. సోమవారం రాజోలు తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

ఆర్థిక నేరాలపై జాగ్రత్తలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఎంపీడీవో వెంకటాచలం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి మైండ్ గో విజన్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరిగే ఆర్థిక నేరాలపట్ల ప్రత్యక్షమైన ఉదాహరణలను, కార్యాచరణ నిమిత్తమై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా ఆర్థిక ప్రణాళిక ప్రతి ఒక్క కుటుంబానికి ఎంతవరకు మేలు చేయగలదనే విషయం మీద ఒక పూర్తి అవగాహనను కల్పించే విధమైన అనేక రకాల విషయాలను 14 రకాల అంశాల పట్ల ప్రతి ఒక్క అంశం సగటు వ్యక్తి యొక్క జీవనం ఏ విధంగా దోహదపడగలదో తెలుపుతూ వివరించారు. 100 మంది స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

యువగళం రెండేళ్ల సంబరాలు

విశాలాంధ్ర - రాజోలు : వైసీపీ అరాచక పాలనపై గళమెత్తుతూ యువనేత నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయ గతినే మార్చివేసిందని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు బోళ్ల వెంకటరమణ, గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రాజోలులో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం వద్ద వేడుక నిర్వహించారు. స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. యువగళం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ, శ్రీనివాస్ మాట్లాడుతూ..జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు లోకేష్ పాదయాత్ర ఎంతగానో దోహదపడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కాండ్రేగుల సత్యనారాయణ, చెల్లింగి సత్యనారాయణ, రాజోలు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, సఖినేటిపల్లి మండల టిడిపి అధ్యక్షులు ముప్పర్తి నాని, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు కాండ్రేగుల భవాని, రాజోలు పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల విజయ్, ప్రధాన కార్యదర్శి కడలి వెంకటరమణ పాల్గొన్నారు.

చైతన్య పాఠశాలలో భేటీ సమాన్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీ చైతన్య పాఠశాలలో భేటీ సమాన్ అనే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం సందర్భంగా సోమవారం 8,9వ తరగతి విద్యా ర్థులతో పాఠశాల నుండి దేవరపల్లి బస్టాండ్ వరకు ర్యాలీ మానవహారం నిర్వహించినట్లు శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ వైస్ ప్రిన్సిపాల్ అను రాధ తెలిపారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగు తున్న బాలికల అత్యాచారాలు మరియు కిడ్నాప్లు హత్యలు కారణంగా ఆడ పిల్లలు స్వేచ్ఛగా తిరగలేకపోతున్నారని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ఏజీఎం పార్థసారథి మాట్లాడుతూ ఆడపిల్లల ఆత్మ రక్షణ గురించి సమాజానికి మా విద్యార్థులతో ర్యాలీ చేశారు. అలాగే దేవరపల్లి గ్రామ కార్యదర్శి ఎన్ రవి కిషోర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్థానిక బస్టాండు వద్ద మానవహారం నిర్వహించారు.

మండల పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం

విశాలాంధ్ర-కడియం : పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా కడియం మండలం జక్కం పూడి నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చల్లా అంజి బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్ర మం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మొక్కల అవసరం గురించి పర్యావరణ పరిరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, ఎంఈఓ లు మణికుమార్, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కూసు సుబ్ర హ్మణ్యం, దామిరెడ్డిపల్లి సర్పంచ్ ముద్రగడ జమ్మి , కడియం ఉపసర్పంచ్ వెలు గుబంటి నాని, వేమగిరి నీటి సంఘం ఉపాధ్యక్షులు సురపురెడ్డి జానకి రామ య్య , కూటమి నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకటేశ్వర స్వామికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమల ఆత్రేయపురం మండ లం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన అన్న ప్రసాద భవన నిర్మాణానికి దాతలు భారీ విరాళం సమర్పించారు. ఆలయ సమీపంలో నిర్మించనున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి అర్ధవరం వాస్తవ్యులు అడ్డాడా వెంకటనాగరాజు, సురేఖ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,11,116లు విరాళంగా అంద జే శారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం నల్లం సూర్య చక్రధరరావు డిప్యూటీ కమిషనర్, రాంబాబు ఆలయ సూపరిండెంట్ స్వామి చిత్రపటాలు ఇచ్చి అభినందించారు.

కడియం వీధులలో గోరంట్ల పర్యటన



విశాలాంధ్ర - కడియం : కడియం గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి బైక్‌పై పర్యటించారు. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, అధికారులతో కలిసి ఇటీవల నూతనంగా నిర్మించిన పలు రోడ్లను, డ్రైన్ లను పరిశీలించారు. గ్రామంలో ప్రధాన వీధులు పరిశీలించిన అనంతరం గ్రామంలో మిగిలిన పలు అభివృద్ధి పనులకు అంచనాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మండల జనసేన పార్టీ అధ్యక్షులు ముద్రగడ జెమ్మి, వనుం సూరిబాబు, తమ్మిశెట్టి ప్రసాద్, భీమన ప్రదీప్, వెన్నపు అయ్యప్ప, చిరుకూరి సుబ్బరాజు, నేలపూడి కింగ్, వరగోగుల వెంకటేశ్వరరావు, బొరుసు సురేష్, సిఐ ఎ వెంకటేశ్వరరావు, డిఇ రవి, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారాల సత్కారం

విశాలాంధ్ర - రాజానగరం : విధి నిర్వ హణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నతమైన సేవలందించి మండల ప్రజలమన్ననలు పొందిన పలువురు మండలాధికారులకు ఉత్తమ సేవాధికారి అవార్డులు వరించాయి. భారతదేశ 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్ర మైన రాజమహేంద్ర వరంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 26న జరిగిన వేడుక ల్లో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ చేతు లు మీదుగా ఉత్తమ అధికారులు అవార్డులను అందుకు న్నారు. దీనిలో భాగంగా పిడి డిఆర్‌డిఎ ఎన్.వి.వి.ఎస్.మూర్తి జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్నారు. తహశీ ల్దార్ జి.ఏ.ఎల్. సత్యవతి దేవి జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించిన డీపీఆర్వో ఐ.కాశి జిల్లా పరిధిలో అవార్డు అందుకు న్నారు. అలాగే రాజానగరం పోలీస్ స్టేషన్ నుండి ఎస్ఐ పి.మనోహర్, కానిస్టేబుల్ బి.వెంకట రమ ణ, తహశీల్దార్ కార్యాలయం నుండి ఎన్నికల సీని యర్ అసిస్టెంట్ సిహెచ్.రామా రావు ,రిజిస్ట్రేషన్ కార్యాలయం నుండి టీ.శ్రీదేవి, డిఈఈ ఆర్.వేంక టేశ్వరబాబు ఉత్తమ పురస్కా రాలు అందుకోవ డంతో పలువురు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా తమ నైపుణ్యాన్ని, అనుభవాన్ని రైతులకు అందిస్తూ రైతుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, కోఆర్డినేటర్, డాక్టర్ మానుకొండ శ్రీనివాసులకు శాస్త్రవేత్తలు విభాగంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతులు మీదుగా అవార్డు లను అందుకున్నారు .దీనిలో భాగంగా అధికారులు హర్షం వ్యక్తం చేసి, అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

జగన్మోహిని కేశవ స్వామికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలోని వెలిసిన పురాతనమైన దేవాలయాల్లో విశిష్ట కలిగిన ఆలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం. ఆలయంలో ఈ ముందు పురుషుని రూపం వెనుక స్త్రీ రూపంలో భక్తులకు స్వామి వారు దర్శనం ఇస్తారు. హైదరాబాద్ వాస్తవ్యులు దండాల రమేష్ రాధారాణి దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు రూ. 1,00,000/- రూపాయలు విరాళం అందించారు. వీరిని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా కార్యనిర్వాహణ అధికారి భాగవతుల వెంకట రమణ మూర్తి, శ్రీనివాస్ స్వామి వారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రాలతో సత్కరించారు.

ఉత్తర్వులు వచ్చినా మారని కార్యదర్శి

- గ్రేడ్ 5 కార్యదర్శితో కొనసాగుతున్న మేజర్ పంచాయతీ

విశాలాంధ్ర - సీతానగరం: ఉత్తర్వులు వచ్చినా మారని కార్యదర్శి. మండలంలో వివాదాస్పదంగా మారిన మేజర్ రఘుదేవ పురం గ్రామ పంచాయతీలో సుమారు ఒక కోటి 35 లక్షల రూపాయలు అవినీతి జరిగింది అని జిల్లా కలెక్టర్ ఇక్కడ విధులు నిర్వహించిన, నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఇంత వివాదాస్పద పంచాయితీలో గ్రేడ్ 5 కార్యదర్శి అయిన భార్గవి అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి నాగలత స్పందిస్తూ సంక్రాంతి పండుగ ముందు ఈఓపిఆర్డీ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. కానీ నేటి వరకూ ఎందుకు బాధ్యతలు స్వీకరించడం లేదు అంటూ ప్రజలు గుసగుసలు ఆడుతున్నారు. గ్రేడ్ 5 కార్యదర్శి మేజర్ పంచాయితీ విధులు నిర్వహించడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపిడిఓ ఎమ్ భారతి వివరణ కోరగా జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారని, ఆ ఉత్తర్వులు ఈఓపిఆర్డీకి ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై అధికారులు స్పందించి మేజర్ పంచాయితీ బాధ్యతలు చేపట్టి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

29న మాజీ సైనికుల అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఏలూరు : ఈ నెల 29 వ తేదీ రాజమండ్రి రివర్ బే హోటల్ లో ఉదయం గం.10నుండి సాయంత్రం గం.5వరకు మాజీ సైనికుల కోసం అవగాహనా సదస్సు ఉమ్మడి పశ్చిమ,ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల సైనిక సంక్షేమ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సోమవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, తూర్పుగోదావరి జిల్లా సైనిక సంక్షేమ అధికారి కె.వి.సాయి ప్రసాద్ రాజు ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సులో స్పర్ష్ / పెన్షన్ / రికార్డ్ అప్డేట్ వంటి సమస్యలు గల ఉమ్మడి (పశ్చిమ గోదావరి పరిధిలో ఏలూరు,పశ్చిమ గోదావరి జిల్లాల)ఉమ్మడి తూర్పు గోదావరి పరిధిలో (డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలకు) చెందిన మాజీసైనికులు ఈ అవకాశము ను సద్వినియోగము చేసుకొనవచ్చున్నారు. మరిన్ని వివరములకు మీకు దగ్గరలో గల మాజీ సైనిక సంక్షేమ సంఘ ప్రతినిధులను, లేదా జిల్లా సైనిక సంక్షేమ అధికారిని (8688817953) వాట్సప్ నంబరు లో గాని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

వైభవంగా ముగిసిన త్యాగరాజస్వామివారి మహోత్సవాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : ముదినేపల్లి మండలం సింగరాయ పాలెంలోని శ్రీ బావాజీ మఠం ప్రాంగణంలో శనివారం నుండి ప్రారంభమైన నవమి వార్షిక శ్రీ త్యాగరాజస్వామి వారి ఆరాధన మహోత్సవాలు మహా అన్న సమారాధనతో వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా సింగరాయపాలెం- చేవూరుపాలెం నాయిబ్రాహ్మణ కళాకారుల సంఘం పలు భక్తి కార్యక్రమాలు , సంగీత విద్వాంసులు , గాయకులు , భజన , మంగళ వాయిద్యాలు , భాగవతార హరికథా కాలక్షేపం అందరిని అలరింపజేశాయి. శ్రీ జ్యోతి సరస్వతి సాయిబాబా మ్యూజికల్ బ్యాండ్ పార్టీ (వీరవాసరం), శ్రీ విఘ్నేశ్వర నాదముని మ్యూజికల్ బ్యాండ్ పార్టీ (పెనుగొండ) ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహా అన్న సమారాధనలో పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాపాయి చెరువులో రోడ్డు నిర్మాణ పనులు

విశాలాంధ్ర - అమలాపురం : మండలంలోని ఉప్పలగుప్తం గ్రామపంచాయతీ పాపాయి చెరువు కొత్త కాలనీలో గ్రామపంచాయతీ 15 ఫైనాన్స్ నిధులతో ఐదు లక్షల రూపాయలు దబ్బ్యా బిఎం రోడ్డు నిర్మాణానికి శంకు స్థాపన చేసి ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ మరియు సర్పంచులు సమైక్య మండల అధ్యక్షులు కడిమి చిన్నవరాజు, వార్డు మెంబర్స్ మరియు గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.